క్లుప్తంగా

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కరపలో పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న చిరంజీవి అభిమానులు

కరప: స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద మంగళవారం సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను రాజకీయాలకు అతీతంగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం 20 మంది పంచాయతీ కార్మికులు, పేదలకు బియ్యం, కాయగూరలు, కిరాణా వస్తువుల కిట్లను అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, చిరంజీవి అభిమానులు నక్కా శ్రీనుబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: నటుడిగా, కేంద్ర మంత్రిగా చిరంజీవి సేవలు అభినందనీయమని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి పంచారు.

జానపద కళాకారుడికి సత్కారం



జానపద కళాకారుడు సత్యనారాయణను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. జానపద కళాకారుడు కేతినీడి సత్యనారాయణను అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు సన్మానించారు. గతంలో అక్షర జ్ఞానం తక్కువగా ఉండే వారు జనపదాలతో పాటలు పాడి జీవిత పరమార్థాన్ని చెప్పే వారని, జానపద కళారూపాలను పరిరక్షించుకోవాలన్నారు.

పళ్లంరాజుకు సముచిత స్థానం

కాకినాడ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి పళ్లంరాజుకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి పల్లంరాజు అందించిన సేవలకు గుర్తింపుగా ఉన్నత పదవిని ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ, పంజాబ్‌సింధ్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ మట్టా ప్రసాద్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, పార్టీ అధికార ప్రతినిధి పెద్దాడ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

చిరంజీవి పుట్టినరోజు వేడుక

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేంద్రమాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



బాల కార్మికుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న కార్మిక శాఖాధికారులు

పెద్దాపురం: బడి ఈడు పిల్లలను కార్మికులుగా మార్చవద్దని కార్మిక శాఖాధికారి వి.పద్మావతి (కాకినాడ) అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో మంగళవారం అధికార బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక చట్టాలపై వర్తకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలను ఎవరైనా కార్మికులుగా ఉపయోగించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం దర్గా సెంటర్, మెయిన్‌రోడ్డు, మార్కెట్ సెంటర్లలో పర్యటించి 14 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాల కార్మికులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.హరికృష్ణ, సీహెచ్ ఉమాదేవి, క్రాంతిలాల్, వీవీ రమణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాగుబడి సానుకూలం

- నియోజకవర్గంలో పుష్కలంగా గోదావరి సాగునీరు
- నిర్దేశిత ఆయకట్టులో 91 శాతం పైగా నాట్లు పూర్తి



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో గోదావరి జలాలతో ఏపుగా పెరిగిన వరిచేలు

కాకినాడ రూరల్: కాలం ప్రతికూలంగా ఉన్నా రైతన్నలు గుండె ధైర్యంతో ముందుకు సాగడంతో కాకినాడ రూరల్ మండలంలో ఖరీఫ్ వరిచేలు ఏపుగా పెరుగుతున్నాయి. ఆయకట్టుకు గోదావరి జలాలు పుష్కలంగా అందుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4600 ఎకరాలలో వరి సాగవుతోందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 4200 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు. తక్కువ నీరు, తక్కువ విత్తనాలు, తక్కువ పెట్టుబడికి వీలుగా ఉండేలా రైతులు సంప్రదాయ పద్ధతిలో నాట్లు వేయకుండా ఎక్కువగా వెదజల్లు పద్ధతిలో సాగుకే మొగ్గు చూపారు. దీంతో ఇప్పటికే ఖరీఫ్ సాగయిన ఆయకట్టులో 3875 ఎకరాల్లో వెదజల్లు పద్ధతిని అనుసరించారు. కేవలం 375 ఎకరాలలో మాత్రమే నాట్లు వేశారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ఎక్కువగా ఎంటీయూ-7029(స్వర్ణ), సంపద స్వర్ణ వంగడాలతో పాటు, బీపీటీ 5204, ఎంటీయూ 1318వంటి రకాలు సాగు చేస్తున్నారు. రైతులకు కావల్సిన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాలలో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీంతో తమ పొలాలలో వరి చేలు ఏపుగా పెరిగేందుకు నీటి యాజమాన్య పద్ధతుల్లో నిమగ్నమయ్యారు. గోదావరి జిల్లాలతో పాటు ఏలేరు జలాలపై కొద్ది ఆయకట్టు ఆధారపడి ఉండడంతో నేమాం ఆయకట్టుకు నీటిని సక్రమంగా అందించేందుకు యు.కొత్తపల్లి నుంచి కాల్వల ద్వారా అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. నిర్దేశిత ఆయకట్టులో సుమారు 91 శాతం పైగా సాగు పనులు పూర్తవ్వడంతో మిగిలిన నాలుగు వందల ఆయకట్టులో వంద ఎకరాలలో సాగయ్యే అవకాశం ఉన్నట్టు వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

ఫలించిన నిరంతర పర్యవేక్షణ

నియోజవర్గంలో సాగు నీటి కష్టాలు లేకుండా రైతులకు పుష్కలంగా నీరు అందించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిరంతరం ఇరిగేషన్ అధికారులతో పర్యవేక్షించారు. దీంతో చాలా వరకు ఫలితం ఇచ్చింది. రమణయ్యపేట క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ఇరిగేషన్ ఎస్ఈ నుంచి ఏఈ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ముఖ్యంగా వరి చేలు ఎండిపోకుండా నీరందించడంతో పాటు శివారు ఆయకట్టుకు సక్రమంగా నీరు చేరేందుకు కాల్వల్లో పూడిక తీత, అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపునకు చొరవ తీసుకోవడంతో ఖరీఫ్ రైతులు నీటి గండం నుంచి చాలా వరకు బయటపడ్డారు.

కరుణించిన వరుణుడు

ప్రతికూల వాతావరణంతో సాగుబడికి చాలా చోట్ల ఇబ్బందులు నెలకొనగా ప్రస్తుతం వాతావరణం మారింది. వరుణుడు కరుణించాడు. కొన్ని రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు మండగా మారిన వాతావరణంతో చల్లగా ఉండడంతో పాటు అవసరమైన మేరకు మాత్రమే వానలు పడుతున్నాయి. దీంతో కాకినాడ పరిసర ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నీరు అంది చేలు బాగున్నాయి



గోదావరి నుంచి సాగునీరు సక్రమంగా అందడంతో చేలు బాగున్నాయి. మా ఊర్లో నాట్లు పూర్తయ్యాయి. వెదజల్లు, నాట్లు ద్వారా సార్వా వేశాం. వాతావరణం బాగుంటే మంచి దిగుబడులకు వీలవుతుంది.

– ముమ్మిడి వెంకటరావు, రైతు, తిమ్మాపురం

యాజమాన్య పద్ధతులు అవసరం



వెదజల్లు పద్ధతిలో చేలు 15 నుంచి 20 రోజుల పంట కాలం అయ్యింది. ఎకరాకు 25 కేజీల యూరియా వేసుకోవడం వలన పంట ఏపుగా పెరుగుతుంది. దమ్ములో భాస్వరం ఎరువు వేయకపోతే 50 కేజీల డీఏపీ ఎరువు చల్లితే సరిపోతుంది. ప్రస్తుతానికి పురుగు మందు అవసరం లేదు. ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాం.

– సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, కాకినాడ రూరల్

తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలి



యండమూరులో మంచినీటి ట్యాంక్ లోపల శుభ్రం చేస్తున్న కార్మికులు

ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు

కరప: మండల పరిధి గ్రామాల్లో రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. గ్రామాల్లోని ట్యాంకులను రెండు వారాలకు ఒకసారి కచ్చితంగా శుభ్రం చేయించాలన్నారు. యండమూరు, కూరాడ తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ట్యాంకుల శుభ్రతపై సూచనలిచ్చారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పి.వీరభద్రరావు, కె.రవి క్లోరినేషన్ చేయించి, తాగునీటిని సరఫరా చేశారు. మంచినీటి పైపుల వద్ద, వీధి కుళాయిల వద్ద లీకులను మూయించి శుభ్రం చేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఈఓ పీఆర్డీ తెలిపారు.

విద్యుత్ కనెక్షన్‌కు వసూళ్లపై విజిలెన్స్ తనిఖీలు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్‌కు ఒక ఉద్యోగి సొమ్ములు వసూలు చేస్తున్నాడని ముఖ్యమంత్రి కార్యాలయానికి కొందరు లబ్ధిదారులు చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఎటువంటి డిపాజిట్లు లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు ఫిర్యాదుదారుల ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరించారు. కనెక్షన్లు పొందిన వారి నుంచి ఫోన్‌పే ద్వారా సొమ్ములు పొందినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

తప్పుడు వాగ్దానాలు నమ్మకండి



గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

గడప గడపలో ద్వారంపూడి

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు ఇస్తున్న తప్పుడు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక 35వ డివిజన్‌లో మంగళవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన వంటి పార్టీలు ప్రజలను మోసగించేందుకు ప్రజల్లోకి వస్తున్నాయని, వీరి తప్పుడు వాగ్దానాలను నమ్మొద్దని సూచించారు. నవరత్న పథకాల ద్వారా ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం జగన్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదల సేవలోనే సంతృప్తి

సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పేదలకు అండగా నిలిచి సేవలందించడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. బాలా త్రిపురసుందరి ఆలయ కమిటీ ఛైర్మన్ పెద్దిరత్నాజీ మిత్ర బృందం ఆధ్వర్యంలో స్థానిక సినిమారోడ్డులోని పలివెలవారి కల్యాణ మండపంలో మంగళవారం వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నయన కంటి వైద్యం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రావుల శ్రీరామ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే పేదలకు చీరలు, పండ్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా హాజరై పెద్ది రత్నాజీ సేవలను ప్రశంసిస్తూ.. ఆయన పుట్టినరోజు వేడుకలను నిరాడబరంగా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

చురుగ్గా ఓటర్ల సర్వే



ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత నెల 21న ప్రారంభమైన ఓటర్ల జాబితా పరిశీలనకు చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఓటర్ల జాబితా పర్యవేక్షణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో చర్యలు తీసుకున్నామని, తదుపరి ఓటర్ల జాబితాకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ చేసి పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, రావు చిన్నదొర, ఎస్.అప్పారావు, రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారులు చైనులు, సురేష్ పాల్గొన్నారు.

నూకాలమ్మతల్లికి బంగారు సూత్రాల సమర్పణ



అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు అందజేస్తున్న దాతలు, (అంతర చిత్రం) బంగారు మంగళ సూత్రాలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. తుని పట్టణానికి చెందిన దాతలు సరిసె శివాజీ దంపతులు మూడు గ్రాముల బంగారు సూత్రాలను ఈఓ టీవీ సూర్యానారాయణకు అందజేశారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనం అందించి సత్కరించారు. ఛైర్మన్ గవరసాని వీరాస్వామి, సభ్యుడు లక్కాకుల కృష్ణ, గవరసాని రాజశేఖర్ తదితరులున్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

కొత్తపల్లి: మూలపేటలోని మహిళా నైపుణ్య అభివృద్ధి ప్రతిభా కేంద్రంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలు, యువతకు మంగళవారం సీనియర్ ఉపాధ్యక్షుడు, ప్లాంట్ హెడ్ అములూరు భాస్కరరావు, లైఫియాస్ ఫార్మా లిమిటెడ్ చేతుల సర్టిఫికెట్లను అందజేశారు. సామాజిక అభివృద్ధి కార్యాక్రమంలో భాగంగా యువతీ, మహిళా సాధికారతకు ప్రాధాన్యత కల్పిస్తూ నైపుణ్య కేంద్రాలను అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వహిస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన 67మందికి సర్టిఫికెట్లను అందజేశారు. యువత అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుకొని ప్రైవేట్, ప్రభుత్వ రంగలలో అవకాశాలను అన్వేషించడానికి ఈ కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ ధర్మారావు, అరబిందో ఫార్మాఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల ఇంటింటి సర్వే వందశాతం పూర్తి

పిఠాపురం: ఓటర్ల జాబితా ప్రీ రివిజన్ చర్యల్లో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం పిఠాపురం నియోజకవర్గంలో ఇంటింటి సర్వే వంద శాతం పూర్తయ్యిందని పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్షన్ అధికారి సుబ్బారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 21వ తేదీ నుంచి ఇంటింటి ఓటర్ల జాబితా సవరణ క్షేత్రస్థాయిలో బూత్‌లెవెల్ అధికారుల ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ప్రతీ వారం సమావేశమై సర్వే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. బీఎల్‌వో యాప్ ద్వారా ఇంటింటి సర్వే సాంకేతిక కారణాల వల్ల నెమ్మదిగా జరుగుతోందని ఆయన తెలిపారు.

అవసరాలు గుర్తించి సేవలు



సుబ్బారావును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ స్మార్ట్ సిటీ సభ్యులు

బోట్‌క్లబ్ : సమాజంలో ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు చేయాలని రోటరీ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు (దత్త) అన్నారు. అధికార పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ స్మార్ట్ సిటీని సందర్శించారు. ఈ ఏడాది రోటరీ మొక్కలు పెంపకంపై దృష్టి సారించిందన్నారు. క్లబ్ సభ్యులు మొక్కలు నాటాలన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరుపేదలకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులను క్లబ్ సభ్యులు గవర్నర్ చేతుల మీదుగా అందించారు. పిఠాపురానికి చెందిన ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సత్కరించారు. స్మార్ట్ సిటీ క్లబ్ సభ్యులకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం క్లబ్ సభ్యులు గవర్నర్‌ను సత్కరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, క్లబ్ అధ్యక్షుడు సామంతుల అజయ్‌కుమార్, కార్యదర్శి నామాడి స్వామి శేఖర్, ట్రెజరర్ పోతుల రాంజీ, ఉపాధ్యక్షులు జుజ్జువరపు మెహర్ తేజ పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి

సామర్లకోట: జగనన్న కాలనీలోని సామూహిక గృహ ప్రవేశాలకు హాజరుకానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని దొరబాబు పేర్కొన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలోని సామర్లకోట జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలల్లో పాల్గొనడానికి వస్తున్నారని తెలిపారు. నవరత్న పథకాలలో ఆయన ఎంతో ఇష్ట మైన పేదలందరికీ ఇళ్ల కోసం సామర్లకోట రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు గిరజాల బాబు

పనులు వేగంగా పూర్తి చేయాలి


- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



వివిధ శాఖల అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

సామర్లకోట: స్థానిక ఈటీసీ లే అవుట్ జగనన్న కాలనీలో ఆయా శాఖల అధికారులకు అప్పగించిన పనులను వేగంగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శుల నుంచి హౌసింగ్, మున్సిపల్, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్ అధికారులతో విడివిడిగా సమీక్షించారు. ఆయా శాఖల సిబ్బందికి అప్పగించిన విధులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్ పర్యటన విజయవంతం కావడంలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ఇప్పటి వరకు ఇళ్ల పనులు ప్రారంభించని వారితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలు, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. డీఎల్‌డీఓ కె.ప్రసాద్‌రాజు, హౌసింగ్ డీఈ రాజు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ ఇస్రో



ఇండియా ఆకారంలో ఉన్న ఏపీఎంఎస్ విద్యార్థులు

తుని రూరల్: చారిత్రాత్మక ఘట్టానికి మరి కొన్ని గంటల దూరంలో ఉన్న చంద్రయాన్-3కి, ఇస్రో శాస్త్రవేత్తలకు తుని మండలం హంసవరంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా ఆల్‌ది బెస్ట్ (శుభాకాంక్షలు) చెప్పారు. మంగళవారం ప్రిన్సిపాల్ పుల్ల పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సహకారంతో చంద్రయాన్-3 రాకెట్ చుట్టూ భారతదేశ పటం ఆకారంలో విద్యార్థులు మానవహారంగా నిలిచి ఆల్ ది బెస్ట్‌గా చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికను అనుసంధానం చేస్తూ మానవ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఇస్రోకి మనమంత ఎంతో రుణపడి ఉన్నామన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా నిలిచారన్నారు. చందమామపై చంద్రయాన్-3 కాలు మోపే ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు తమ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆమె వివరించారు. దీనివల్ల ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.